సైలెన్సర్లు మారిస్తే చర్యలు తప్పవు


సైలెన్సర్లను బుల్డోజర్‌తో తొక్కిస్తున్న దృశ్యం

సనత్‌నగర్: షోరూం నుంచి వచ్చిన వాహనాల సైలెన్సర్లను మారిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. నార్త్‌జోన్ పరిధిలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్ ద్వారా వాహనదారులపై 1910 కేసులు నమోదు చేయగా, దాదాపు వెయ్యి వరకు మోడిఫైడ్ సైలెన్సర్లను స్వాధీనం చేసుకున్నారు. వీటిని సోమవారం బేగంపేట ట్రాఫిక్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్ ఆవరణలో బుల్డోజర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ డీసీపీ సుబ్బారాయుడు, అడిషనల్ డీసీపీ రంగారావు, నార్త్‌జోన్ ఏసీపీ శంకర్‌రాజు మాట్లాడుతూ.. చాలామంది ప్రత్యేకంగా కనిపించాలనే ఆరాటంతో తమ బైక్‌లకు మోడిఫైడ్ సైలెన్సర్లు, ప్రెజర్ హారన్‌ను అమర్చుతారని దీనివల్ల శబ్ద కాలుష్యం పెరిగి ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. సవరించిన సైలెన్సర్ల కారణంగా హానికరమైన కాలుష్య కారకాలు అధిక స్థాయిలో విడుదలవుతాయన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాతో పాటు జైలుశిక్ష విధిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీటీఐ ఏసీపీ వెంకటేశ్వర్లు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు పాపయ్య, ఉపాశంకర్, మధుబాబు, భాస్కర్, వెంకటరమణ, నాగయ్య పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా

వ్యాపారాలు చేసుకోవాలి


ఫుట్‌పాత్ వ్యాపారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్

బన్సీలాల్‌పేట్: ప్రజలకు ఏలాంటి ఇబ్బందులు కలుగకుండా తమ వ్యాపారాలను నిర్వహించుకోవాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఫుట్‌పాత్ వ్యాపారుల సమస్యలు, ట్రాఫిక్ సమస్యల పరిష్కారం కోసం మోండా మార్కెట్ డివిజన్‌లోని పాలికా బజార్‌లో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సోమవారం ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీస్ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక చిరువ్యాపారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నిర్దేశించిన స్థలంలో మాత్రమే తమ వ్యాపారాలను నిర్వహించుకోవాలని, చిరు వ్యాపారులు, తోపుడు బండ్ల వారు రోడ్లపై వరకు వచ్చి పాదచారులకు, వాహనదారులు ఇబ్బందులకు గురి కాకుండా చూసుకోవాలన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, మోండా మార్కెట్ ప్రాంతంలో గత 50 సంవత్సరాల నుంచి అనేక మంది పేదలు వివిధ వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని వారిపట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఆకుల రూప, ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు, ఇన్‌స్పెక్టర్ శంకర్, మోండామార్కెట్ పీఎస్ సీఐ రాఘువేందర్, నేతలు హరికృష్ణ, నాగులు, రాములు,అత్తిలి శ్రీనివాస్‌గౌడ్, మహేశ్‌యాదవ్, అమర్, వెంకటేష్‌రాజు, లక్ష్మీపతి, ప్రేమ్‌కుమార్,కిషోర్, వ్యాపారుల అసోసియేషన్ సభ్యులు అశోక్, బబ్లూ,అల్తాఫ్, అబ్బాస్ పాల్గొన్నారు.

ఒడిషా వాసుల సమస్యల పరిష్కారానికి కృషి


బంధుమిలన్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మహేందర్ రెడ్డి

కంటోన్మెంట్: నగరంలో జీవనం సాగిస్తున్న ఒడిషా వాసుల సమస్యల పరిష్కారానికి తాను ప్రత్యేక చొరవ చూపుతానని ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. ఒడిషా పీపుల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తిరుమలగిరి జయలక్ష్మీ గార్డెన్స్ ఆవరణలో నిర్వహించిన ఉత్కల్ దివస్, బంధుమిలన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మినీ భారత్ వంటి మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజలు నివసిస్తున్నారన్నారు. సుమారు లక్షమంది ఒడిషా వాసులు నగరంలో జీవనం సాగిస్తున్నారని వారికి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా తగిన సహకారం అందేలా చూస్తానని అన్నారు. ముఖ్యంగా బతుకుదెరువు కోసం నగరానికి వచ్చిన ఇతర రాష్ట్రాల వాసుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు. అధ్యక్షులు రేష్మీ రంజన్ మహాపాత్ర, లావణ్య మహాపాత్ర ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో సుమారు వెయ్యిమందికి పైగా ఒడిషా వాసులు పాల్గొన్నారు. మహాపాత్ర మాట్లాడుతూ.. సికంద్రాబాద్ పరిధిలో జగన్నాథ్ టెంపుల్ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వ సహకారం తీసుకుంటామన్నారు. ఈ నెల 13వ తేదీన ఒడిషా నూతన సంవత్సర వేడుకలు ప్రారంభం అవుతాయని, ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఒడిషా వాసుల బంధుమిలన్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాహుల్ కృష్ణన్, సామల రాఘవ రెడ్డి పాల్గొన్నారు.

ఆలిండియా గణితశాస్త్ర పోటీల్లో చిన్నారికి 17వ ర్యాంకు

కాచిగూడ: జాతీయ స్థాయి గణితశాస్త్ర పోటీ పరీక్షలలో నారాయణగూడకు చెందిన నాలుగవ తరగతి విద్యార్థిని తులసిరెడ్డి ప్రతిభను చాటి 17వ ర్యాంకును సాధించింది. దీంతో తులసిరెడ్డిని నారాయణ పాఠశాలల జీఎం గోపాల్‌రెడ్డి, ఏజీఎం బాలపరమేశ్వర్ ఘనంగా సత్కరించి అభినందించారు. సర్టిఫికెట్‌తోపాటు జ్ఞాపికను, బంగారు పతకాన్ని తులసిరెడ్డికి అందజేశారు. నారాయణగూడ నారాయణ స్కూల్ ప్రైమరీ జోన్ ఇన్‌చార్జి భవాని, ప్రిన్సిపాల్ హర్‌నీత్ కౌర్, వైస్ ప్రిన్సిపాల్ మోహి ఉన్నీసా, తులసిరెడ్డి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



తులసిరెడ్డికి సర్టిఫికెట్, మెమెంటో అందజేస్తున్న గోపాల్‌రెడ్డి

కార్పొరేట్ విద్యా సంస్థల ఆగడాలను అరికట్టాలి

కాచిగూడ: కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థల ఆగడాలను అరికట్టడంలో విద్యాశాఖ అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారని బీసీ విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ అన్నారు. సోమవారం కాచిగూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు విద్యాహక్కు చట్టాన్ని, ఫీజు నియంత్రణ చట్టాన్ని ఉల్లంఘిస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయన్నారు. లక్షలాది రూపాయలు ఫీజుల పేరుతో వసూలు చేస్తున్నాయని విమర్శించారు. ఫీజులు చెల్లించలేని విద్యార్థులకు టీసీలు ఇస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆరోపించారు. ఆయా పాఠశాల, కళాశాలలపై ఫిర్యాదు చేసినా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని, దీనిపై ఫిర్యాదులు అందుకున్న విద్యాశాఖ అధికారులు నోటీసులు అందజేసినా ఆయా విద్యా సంస్థలు పెడచెవిన పెడుతున్నాయని అన్నారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

విటుల్లో మేయర్ మాజీ పీఏ తోట రాజేష్

సనత్‌నగర్: వ్యభిచార గృహంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి నిర్వాహకులతో సహా ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఇందులో గ్రేటర్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ మాజీ పీఏ తోట రాజేష్‌తో పాటు ఓ మైనర్ బాలిక కూడా ఉన్నారు. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ సంఘటన వివరాలు పోలీసులు తెలిపిన ప్రకారం ఇలా ఉన్నాయి.. బేగంపేట ప్రకాష్‌నగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో వ్యభిచారం జరుగుతున్నట్లు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు ఈనెల 23న టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. వ్యభిచార కేంద్రం నిర్వహిస్తున్న ఓ మహిళతో పాటు సహ నిర్వాహకుడు సాయికుమార్ (24), బ్రోకర్లుగా వ్యవహరిస్తున్న వై.సంజయ్ (21), వంశీకృష్ణ (25), మరో ముగ్గురు విటులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విటుల్లో ఒకరు మేయర్ విజయలక్ష్మీ పీఏగా పనిచేసి రెండు నెలల క్రితం మానేసిన తోట రాజేష్‌తో పాటు శ్రీకాంత్‌వర్మ, శ్రవణ్ అనే ఇద్దరు వ్యక్తులను పోలీసులు గుర్తించారు. ఈ దాడులు జరిగిన ప్రదేశంలో మైనర్ బాలిక (17) కూడా ఉన్నట్లు పోలీసుల దాడుల్లో తేలింది. ఇద్దరు నిర్వాహకులు, మరో ఇద్దరు బ్రోకర్లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అలాగే విటులుగా వచ్చిన వారికి నోటీసులు జారీ చేశారు. తదుపరి విచారణ నిమిత్తం కేసును టాస్క్‌ఫోర్స్ పోలీసులు బేగంపేట పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు.

తోట రాజేష్‌కు మేయర్ కార్యాలయంతో ఎలాంటి సంబంధం లేదు..

మేయర్ పీఏగా తోట రాజేష్ ఫిబ్రవరిలో విధుల నుంచి తప్పుకున్నాడు. ప్రస్తుతానికి తోట రాజేష్‌కి మేయర్ కార్యాలయం, మేయర్‌కు ఎటువంటి సంబంధం లేదు. సామాజిక మధ్యమంలో ప్రచారం అవుతున్న న్యూస్‌కి, మేయర్ కార్యాలయానికి సంబంధం లేదంటూ మేయర్ కార్యాలయం ప్రకటనను విడుదల చేసింది.



కంటోన్మెంట్‌లోనూ

మర్రి vs మైనంపల్లి



- ఉప ఎన్నికల వేళ బీఆర్ఎస్, కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌లుగా మారిన వైనం
- కాంగ్రెస్‌లోకి రమ్మంటూ మైనంపల్లి ఆహ్వానాలు
- తొందరపడొద్దంటూ మర్రి బుజ్జగింపులు

కంటోన్మెంట్: గత అసెంబ్లీ ఎన్నికల్లో మల్కాజిగిరి అసెంబ్లీ ఎన్నిక హాట్ టాపిక్‌గా మారింది. కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల తరపున బరిలో నిలిచిన మైనంపల్లి హన్మంతరావు, మర్రి రాజశేఖ్ రెడ్డిల మధ్య పోటీ యుద్ధాన్ని తలపించింది. అసెంబ్లీ ఎన్నికల్లో మర్రి రాజశేఖర్ రెడ్డి గెలిచి పైచేయి సాధించారు. కానీ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో రావడంతో మైనంపల్లి మళ్లీ యాక్టివ్ అయ్యారు. పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి పార్లమెంట్‌తో పాటు, కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతున్నారు. కంటోన్మెంట్ వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో ఉన్న తన అనుచరగణంతో పాటు, బీఆర్ఎస్ నుంచి కీలక నేతలను కాంగ్రెస్‌లో చేర్పించే ప్రయత్నాల్లో ఉన్నారు. ఇప్పటికే పలువురు నేతలు మైనంపల్లిని కలవగా, మరికొందరు అదేబాటలో ఉన్నారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ సైతం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. కంటోన్మెంట్ స్థానికుడైన మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికి ఈ బాధ్యతలు అప్పగించింది. దీంతో కంటోన్మెంట్ రాజకీయం ఒక్కసారిగా మర్రి వర్సెస్ మైనంపల్లిగా మారిపోయింది.


గత వారం మైనంపల్లి హన్మంతరావును కలిసిన పలువురు నేతలు

మైనంపల్లికి సైతం పట్టు..

అల్వాల్ ప్రాంతానికి చెందిన మైనంపల్లి హన్మంతరావుకు కంటోన్మెంట్ వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో అనుచరగణం ఉంది. వ్యక్తిగతంగా పెద్ద ఎత్తున పరిచయాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కంటోన్మెంట్ అసెంబ్లీ ఎన్నికల బాధ్యతలు కూడా ఆయనే భుజాన వేసుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే లాస్య నందిత మృతితో ఉప ఎన్నికలు రావడంతో అధికార కాంగ్రెస్ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చూస్తోంది. గత ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున పోటీ చేసిన వెన్నెలకు సైతం నియోజకవర్గంలో పెద్దగా పట్టు లేక పోవడంతో ఇతర నేతలను పార్టీలోకి రప్పించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే తొలుత లాస్య నందిత సోదరి నివేదితను కాంగ్రెస్‌లో చేర్చుకుని, ఆమెకు పార్టీ టికెట్ ఇస్తామని హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ ప్రయత్నం ఎక్కడ బెడిసికొట్టిందో కానీ, మైనంపల్లి రూటు మార్చి గత ఎన్నికల్లో బీజేపీ తరపున పోటీ చేసిన శ్రీగణేశ్‌ను కాంగ్రెస్‌లో చేర్పించారు. దీంతో అటు కాంగ్రెస్‌ను బలోపేతం చేయడంతో పాటు, బీజేపీని బలహీనం చేయడంలో విజయం సాధించగలిగారు. ఇక బీఆర్ఎస్‌ను కూడా నిర్వీర్యం చేస్తే కాంగ్రెస్ గెలుపు సునాయసం అవుతుందని భావించి పలువురు నేతలను కాంగ్రెస్‌లో చేర్పించే పనిలో పడ్డారు. ఈ పాటికే పెద్ద సంఖ్యలో నేతలతో సంప్రదింపులు జరిపినట్లు సమాచారం.

బుజ్జగిస్తున్న మర్రి..

కంటోన్మెంట్ బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు పార్టీ మారే అవకాశముందని తెలుసుకున్న అధిష్ఠానం వారిని ఒప్పించే పనిని మర్రి రాజశేఖర్ రెడ్డికి అప్పగించింది. గత అసెంబ్లీ ఎన్నికల నుంచి కంటోన్మెంట్ రాజకీయాలను పూర్తిగా పక్కన పెట్టిన మర్రి మళ్లీ కీలకంగా మారిపోయారు. పార్టీలోని అసంతృప్త నేతలు, కార్యకర్తలతో వ్యక్తిగతంగా మాట్లాడుతూ నచ్చ చెబుతున్నారు. పార్టీ మారేందుకు గల కారణాలు తెలుసుకుంటూ, వారిని బుజ్జగిస్తున్నారు. ఈ సందర్భంగా కొందరు నేతలు తమను పార్టీ మారకుండా నిలువరించి, త్వరలో నువ్వే మారితే మా పరిస్థితి ఏంటని మర్రిని ప్రశ్నించినట్లు తెలుస్తోంది. ఇటీవల మర్రి మామ, మాజీ మంత్రి మల్లారెడ్డి కాంగ్రెస్‌లో చేరుతారంటూ వచ్చిన ప్రచారాన్ని ఉదహరిస్తున్నారు. అయితే ఈ విషయంలో మర్రి నుంచి స్పష్టమైన సమాధానం కరువైందని తెలుస్తోంది. మొత్తానికి మర్రి, మైనంపల్లి మధ్య మల్కాజిగిరిలో మొదలైన పోరు కాస్తా కంటోన్మెంట్‌కూ పాకింది. ఈ సారి ఎవరు పైచేయి సాధిస్తారో వేచి చూడాల్సిందే.


బోర్డు మాజీ సభ్యులో బీఆర్ఎస్ అభ్యర్థి ఎంపికపై చర్చిస్తున్న మర్రి

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.17, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 35, పచ్చిమిర్చి 55, బజ్జీమిర్చి 35, క్యాప్సికమ్ 65, పచ్చకాకర 35, పందిరి బీర 35, క్యాబేజీ 19, క్యారెట్ 23, దొండ 23, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 50, గోకరకాయ 23, కీర 21, దోసకాయ 16, బీట్‌రూట్ 19, ఉల్లిగడ్డ 20, ఆలుగడ్డ 31, చామగడ్డ 40, మొరంగడ్డ 18, కందగడ్డ 60, సొరకాయ 9, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 3–4, ముల్లంగి 4–5.

నియామకం


ఆకుల మహేష్‌కుమార్

సనత్‌నగర్: బీజేపీ సనత్‌నగర్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్‌గా బీకే గూడకు చెందిన ఆకుల మహేష్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ మహంకాళి–సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్ సోమవారం ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు శ్యాంసుందర్‌గౌడ్, సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ శ్రీశైలంగౌడ్, రాష్ట్ర నాయకులు లింగంపల్లి నర్సింగరావుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో కిషన్‌రెడ్డి అత్యధిక మెజారిటీ సాధించేందుకు కృషి చేస్తానన్నారు.

బీజేపీ ఓబీసీ సెల్ మోర్చా ఉపాధ్యక్షుడిగా..

రాంగోపాల్‌పేట్: బీజేపీ ఓబీసీ సెల్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులుగా చీర సత్యనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ అధ్యక్షులు గండమల్ల ఆనంద్ గౌడ్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా చీర సత్యనారాయణ మాట్లాడుతూ.. బీజేపీ సిద్ధాంతాలు, ఆదర్శాలకు అంకితమై నీతి, నిజాయితీ, క్రమశిక్షణతో వ్యవహరిస్తానని అన్నారు. వెనుకబడిన వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

24 నుంచి ఫౌండేషన్ డే

ఉస్మానియా యూనివర్సిటీ: ఈ నెల 24 నుంచి ఓయూలో ఫౌండేషన్ డే ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. 24న మార్నింగ్ వాక్, 25న ఓపెన్ డే సందర్భంగా యూనివర్సిటీలోకి సందర్శకులకు ఉచిత ప్రవేశం ఉంటుంది. 26న ఉదయం ఫౌండేషన్, కార్యక్రమాలు జరగనున్నాయి. ఫౌండేషన్ డే సందర్భంగా ఠాగూర్ ఆడిటోరియంలో ఫౌండేషన్ లెక్చర్‌ను నిర్వహించనున్నారు.

రికార్డు స్థాయిలో ఆస్తి పన్ను వసూలు

సనత్‌నగర్: జీహెచ్ఎంసీ బేగంపేట సర్కిల్ పరిధిలో రికార్డు స్థాయిలో ఆస్తి పన్ను వసూలైంది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి రూ.98.20 కోట్ల ఆస్తి పన్ను వసూలు చేశారు. గతేడాది రూ.87 కోట్లు ఉండగా ఈ సంవత్సరం 11 కోట్లు అదనంగా వసూలు కావడం గమనార్హం. 108 కోట్ల లక్ష్యానికి చేరువగా సర్కిల్ సిబ్బంది ఆస్తి పన్నును రాబట్టారు. వన్‌టైమ్ సెటిల్‌మెంట్ స్కీం (ఓటీఎస్) ద్వారా ఆస్తి పన్ను వడ్డీపై 90 శాతం రాయితీ ప్రకటించడం సత్ఫలితాలను ఇచ్చింది. ఒక్క మార్చి నెలలో 29 కోట్ల ఆస్తి పన్ను వసూలైనట్లు అధికారులు తెలిపారు.

నార్త్‌జోన్ ట్రాఫిక్ సిబ్బంది ఉదారత

మృతి చెందిన హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం



సనత్‌నగర్: నార్త్‌జోన్ ట్రాఫిక్ సిబ్బంది మానవత్వాన్ని చాటారు. తోటి పోలీసు ప్రమాదానికి గురై తనువు చాలిస్తే ఆ కుటుంబానికి అండగా నిలిచారు. నార్త్‌జోన్ ట్రాఫిక్ పోలీసులు తలో కొంత వేసుకుని ఆర్థిసాయం అందజేశారు. బేగంపేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో గత ఐదేళ్లుగా పనిచేస్తున్న హోంగార్డు కృష్ణయాదవ్ గతేడాది డిసెంబర్ 3న రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు. అతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు తెలుసుకున్న నార్త్‌జోన్ ట్రాఫిక్ పోలీసులు విరాళాల ద్వారా రూ.2,50,000లను సేకరించి సోమవారం ట్రాఫిక్ డీసీపీ సుబ్బారాయుడు, అడిషనల్ డీసీపీ రంగారావు, ఏసీపీ శంకర్‌రాజు సమక్షంలో కృష్ణయాదవ్ భార్యకు అందజేశారు.

5 నుంచి రాజ్యాంగ పరిరక్షణ సదస్సులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఏప్రిల్ నెలను మహనీయుల మాసంగా ప్రకటించుకొని సామాజిక సంఘాల ఆధ్వర్యంలో ఏప్రిల్ 5 నుంచి 14వ తేదీ వరకు రాజ్యాంగ హక్కులను పరిరక్షించుకుందాం, మనువాదాన్ని మట్టుపెడదాం అనే నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా సామాజిక సదస్సులు నిర్వహించనున్నట్లు టీపీఎస్‌కే రాష్ట్ర కన్వీనర్ జి.రాములు తెలిపారు. సోమవారం చిక్కడపల్లిలోని కేవీపీఎస్ రాష్ట్ర కార్యాలయంలో వివిధ సంఘాల ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ... పదేళ్ల బీజేపీ పాలనలో రాజ్యాంగం రద్దుకు కుట్రలు చేశారే తప్ప దళితులు, గిరిజనులు, బలహీన, మైనార్టీల వర్గాలకు ఎలాంటి మేలు చేయలేదన్నారు. బీజేపీ ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతుందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళితులు అభద్రతతో జీవిస్తున్నారని విమర్శించారు. కేవీపీఎస్ అధ్యక్షుడు జాన్‌వెస్లీ, ప్రధాన కార్యదర్శి టి.స్కైల్యాబ్‌బాబు, గిరిజన సంఘం కార్యదర్శి ఆర్.శ్రీరామ్‌నాయక్, కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షుడు ఎం.వి.రమణ, ఆవాజ్ కార్యదర్శి ఎం.డి.అబ్బాస్, మత్స్యకార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి లెలెల్ల బాలకృష్ణ పాల్గొన్నారు.

ట్రయల్ లేని వ్యాక్సిన్ తీసుకున్న వారిలో

అరుదైన వ్యాధుల గుర్తింపు

పంజగుట్ట: ఎలాంటి ట్రయల్ లేకుండా ఇచ్చిన వ్యాక్సిన్‌ల వల్ల చిన్నపిల్లల భవిష్యత్ తరాలు అంధకారంలోకి వెళ్లే పరిస్థితి ఉందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. కరోనా టీకాల వల్ల ఇప్పటికీ అకస్మాత్తుగా గుండెనొప్పి, పక్షవాతం, కిడ్నీ సమస్యలు, కేన్సర్ లాంటి వ్యాధులు వస్తున్నాయని వారు పేర్కొన్నారు. యూనివర్సల్ హెల్త్ ఆర్గనైజేషన్, అవేకన్ ఇండియా మూవెంట్ తెలంగాణ ఆధ్వర్యంలో సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయా సంస్థల భాధ్యులు నర్సింహారెడ్డి, డాక్టర్ భాస్కర్ రామన్, డాక్టర్ ప్రవీణ్ సక్సెనా, డాక్టర్ శ్రీసుధ, సరస్వతి మాట్లాడారు. టీకాల పేరుతో ప్రభుత్వాలు రాజకీయం చేస్తున్నాయని, రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలకు టీకాలను వాడుకుంటున్నారని ఈ సందర్భంగా వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆకస్మిక గుండెపోటు మరణాలకు టీకాలు భాద్యత కావాలని ఐసీఎంఆర్ అంటుందని టీకాల వల్ల కాదని ఎలాంటి ఆధారాలు ఉన్నాయని ప్రశ్నిస్తే దానికి సమాధానం లేదన్నారు. కరోనా వ్యాక్సిన్ తీసుకున్న తరువాత ప్రతి రోజూ ఔట్ పేషెంట్ విభాగానికి వచ్చే రోగుల్లో అరుదైన వ్యాధులు గుర్తిస్తున్నామని వైద్యులు తెలిపారు. టీకా వేసుకోవాలని గతంలో బలవంతం చేసి మరీ టీకాలు ఇచ్చారన్నారు. ఇప్పటికైనా ప్రజలు బూస్టర్ డోస్‌లు, కొత్త డోసులు తీసుకోవద్దని సూచించారు.

రైలులో గంజాయి తరలిస్తున్న ఇద్దరి రిమాండ్

సికింద్రాబాద్: రైలులో తరలిస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకొని నిందితులను అరెస్ట్ చేసిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం.. వికారాబాద్‌లో ఆదివారం కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం బీ–6 కోచ్‌లో అనుమానాస్పదంగా రెండు బ్యాగులు కనిపించాయి. మధ్యప్రదేశ్‌కు చెందిన సదరు బ్యాగుల యజమానులు మనోజ్ కుమార్(25) అనిల్ ఉపాద్యాయ్(28)ను విచారించి బ్యాగులను తెరిచి చూడగా, అందులో 14 కిలోల గంజాయి కనిపించింది. గత నెల 30న సాయంత్రం 6 గంటల సమయంలో భరంపూర్ రైల్వే స్టేషన్‌లో ఓ గుర్తు తెలియని వ్యక్తి తమ వద్దకు వచ్చి ఈ రెండు గంజాయి బ్యాగులను ముంబాయి వరకు తరలిస్తే ఒక్కొక్కరికి రూ. 25 వేల చొప్పున ఇస్తానని ఆశ చూపించడంతో గంజాయి రవాణాకు ఒప్పుకున్నామన్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు రైల్వే డీఎస్పీ శ్రీనివాస రావు వెల్లడించారు.


గంజాయితో పట్టుబడ్డ పెడ్లర్లు

మురుగు పరుగుకు చెక్


వ్యర్థాలు తొలగిస్తున్న సిబ్బంది


సాక్షిలో ప్రచురితమైన కథనం

లాలాపేట: తార్నాక డివిజన్ శాంతినగర్‌లో గత కొన్ని రోజుల నుంచి మ్యాన్‌హోల్ పొంగి రోడ్డంతా దుర్గంధంగా మారింది. ఈ సమస్యపై 'మురుగు.. పరుగు' అనే శీర్షికతో సోమవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో జలమండలి సిబ్బంది మ్యాన్‌హోల్‌లోని వ్యర్థాలు తీసి సమస్యను పరిష్కరించారు.

వైస్ చాన్సలర్ రీసెర్చ్ అవార్డులకు మంగళం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో అధ్యాపకులకు ప్రదానం చేసే వైస్ చాన్సలర్ రీసెర్చ్ అవార్డులకు మంగళం పలికారు. అధ్యాపకుల్లో పరిశోధనల పట్ల ఆసక్తిని పెంచి ప్రోత్సహించేందుకు ప్రస్తుత వీసీ ప్రొ.రవీందర్ రెండు సంవత్సరాల క్రితం చాన్సలర్ అవార్డును ప్రవేశపెట్టారు. వివిధ అంశాల పై పరిశోధనల పత్రాలను పరిశీలించి అధ్యాపకులు చేసుకున్న దరఖాస్తుల ఆధారంగా ఎంపిక చేసేవారు. కానీ ఈ సంవత్సరం పోటీలకు నోటిఫికేషన్ వెలువడి అధ్యాపకులు దరఖాస్తు చేసుకున్నా అవార్డులను అందించలేదు. ప్రస్తుత వీసీ పదవీ కాలం వచ్చే నెల 23తో ముగియనుండటంతో వైస్ చాన్సలర్ అవార్డులకు స్వస్తి పలికినట్లేనని పలువురు సీనియర్ అధ్యాపకులు పేర్కొన్నారు.

సురేష్ కుటుంబానికి అండగా ఉంటాం


సురేష్ భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న నివేదిత

రసూల్‌పురా: అనారోగ్యంతో మృతి చెందిన మడ్‌ఫోర్ట్‌వాసి సురేష్ కుటుంబానికి అండగా ఉంటామని బీఆర్ఎస్ నాయకురాలు నివేదిత అన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గం మడ్‌ఫోర్ట్ గాంధీనగర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు రమేష్ సోదరుడు సురేష్ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న నివేదిత, బోర్డు మాజీ సభ్యురాలు అనిత ప్రభాకర్ సోమవారం సురేష్ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం సురేష్ కుటుంబాన్ని ఓదార్చారు. అన్ని విధాలా ఆదుకుంటామని నివేదిత భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు సుదర్శన్, శేఖర్, రాకేష్ మాదిగ స్థానికులు పాల్గొన్నారు.

విద్యావాహిని స్కూల్‌లో సైన్స్ ఫెయిర్


నమూనాలను పరిశీలిస్తున్న అతిథులు

అడ్డగుట్ట: అడ్డగుట్టలోని విద్యావాహిని హైస్కూల్‌లో సోమవారం సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన వివిధ నమూనాలు ఆకట్టుకున్నాయి. సత్యసాయి సేవా సమితి కన్వీనర్ వసంత, గోపాల కృష్ణ, స్కూల్ ప్రిన్సిపల్ సంధ్యారాణి, శివకుమార్, విద్యార్థుల తల్లిదండ్రుల పాల్గొన్నారు.

పదవీ విరమణ


కార్యక్రమంలో పాల్గొన్న రోహిణిదీప్తి తదితరులు

రసూల్‌పురా: తిరుమలగిరి మండల డిప్యూటీ ఐఓఎస్ బీఎం.విజయ్‌కుమార్ పదవీ విరమణ కార్యక్రమం రిసాలబజార్ ప్రభుత్వ బాలుర పాఠశాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హైదరాబాద్ జిల్లా విద్యాధికారిణి రోహిణి దీప్తి, డిప్యూటీ ఎడ్యుకేషన్ అధికారి బాలునాయక్ హాజరై విజయ్‌కుమార్ దంపతులను సన్మానించి వీడ్కోలు పలికారు. డీఈఓ యాదయ్య, వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని యువకుడి మృతి


అశోక్ బాబా

సికింద్రాబాద్: పట్టాలపై నడుచుకుంటూ వెళ్తున్న యువకుడు ప్రమాదవశాత్తు రైలు ఢీకొని మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం.. నాందేడ్‌కు చెందిన అశోక్ బాబా(20) ఆదివారం రాత్రి సమయంలో గుండ్ల పోచంపల్లి–బొల్లారం రైల్వే స్టేషన్ల మార్గమధ్యలోని పట్టాలపై నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక వైపు నుంచి వచ్చిన రైలు అశోక్‌ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

మరో ఘటనలో ఆత్మహత్య..

సికింద్రాబాద్: మానసికస్థితి సరిగా లేని ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసుల కథనం ప్రకారం. బొల్లారంలోని ఆదర్శ్‌నగర్‌కు చెందిన నాగరాజు(30) ప్రైవేటు ఉద్యోగి. మానసికస్థితి సరిగా ఉండని కారణంగా నాగరాజు మద్యానికి బానిసయ్యాడు. సోమవారం బొల్లారం బజార్ రైల్వే స్టేషన్ ఆఫ్‌లైన్‌లో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.